# కూరగాయలు కొనలేం.. తినలేం !

- కూటమి ప్రభుత్వంలో రెండింతలు పెరిగిన కూరగాయల ధరలు
- కార్తీక మాసంలో మరింత పెరుగుదల
- అదుపు చేసే ప్రయత్నం చేయని ప్రభుత్వం


మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

**నంద్యాల:** సామాన్యుడికి కూరగాయల ధరలు అందనంత దూరంలో ఉన్నాయి. ఏ కూరగాయ ధర చూసినా కిలో దాదాపు రూ.50 పైమాటే గానీ అంతకన్నా తక్కువకు మార్కెట్‌లో దొరకడంలేదు. మార్చి నెలలో రూ.30 లోపు ఉన్న కూరగాయలు ఇప్పుడు రూ.50 నుంచి రూ.80 వరకూ ఉన్నాయి. సామాన్యుని బడ్జెట్‌లో సింహభాగం కూరగాయలకే వెచ్చించాల్సి రావడంతో వారి జీవనం భారంగా మారిపోతోంది. ప్రస్తుతం కూరగాయల ధరలు మాంసాహార ధరలతో పోటీపడుతున్నాయని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం దాటినా వాటి ధరలు మరింత పెరుగుతుండడంతో ఏమి కొనాలో, ఏమి తినాలో పాలు పోక పచ్చడి మెతుకులతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

**కూటమి ప్రభుత్వంలో పెరిగిన ధరలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రభుత్వం దళారులకు అండగా నిలుస్తుండ డంతో పెత్తనమంతా వారిదే అవుతోంది. సోమవారం నంద్యాల రైతు బజార్లల్లో గరిష్ఠంగా టమాట రూ.40, వంకాయలు రూ.80, బెండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయలు రూ.70, బీరకాయలు రూ.65, క్యాలీఫ్లవర్ రూ.50, క్యాబేజీ రూ.40, దొండకాయలు రూ.50, ఆలుగడ్డలు రూ.40, ఉల్లిగడ్డ రూ.60, దోసకాయలు రూ.60, చిక్కుడు రూ.50, ఆకు కూరల కట్ట రూ.15 ఉన్నాయి. కొందరు రైతు బజారు వ్యాపారులు పట్టికలో ఉన్న ధరలకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడు. బహిరంగ మార్కెట్‌లో వీటి ధరలు కిలోకు మరో రూ.10 అదనంగా ఉంటున్నాయి.

**కార్తీక మాసంలో కూరగాయలకు డిమాండ్..**

హిందువులకు కార్తీక మాసం ప్రత్యేకమైనది. ఈ మాసంలో 50 శాతం మంది ప్రజలు ఇంటిలో మాంసాహారం వండనే వండరు. ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారాలు, కార్తీక ఏకాదశి, కార్తీక పౌర్ణమి వంటి పూజలతో పాటు చాలా మంది ఇళ్లల్లో కార్తీక నోములు నోచుకుంటూ ఉంటారు. అలాగే చాలా మంది భక్తులు అయ్యప్ప, శ్రీవేంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి మాలలు ధరించి దీక్షతో వ్రతాలు ఆచరిస్తూ ఉంటారు. వీరు తమ బంధుమిత్రులకు అన్న సమారాధన నిర్వహిస్తూ ఉంటారు. దీంతో కార్తీక మాసంలో కూరగాయలకు డిమాండు ఎక్కువగా ఉంటుంది. ఈ డిమాండ్ మేరకు ప్రతి ఏటా కూరగాయల ధరలు పెరగడం సహజం. అయితే సాధారణ రోజుల్లోనే కొనలేని పరిస్థితిలో ఉంటే కార్తీక మాసంలో వీటి ధరలు ఏ స్థాయిలో పెరుగుతాయో అనే ఆందోళన సామాన్య ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**అదుపు చేయని ప్రభుత్వం..**

కూరగాయల ధరలు రెండింతలు పెరిగినా నియంత్రించేందుకు ఏ ఒక్క అధికారి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువులు, వంట నూనెల ధరలు పెరగడంతో వాటిని రైతు బజార్లతో పాటు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి తక్కువ ధరకు అందించే ఏర్పాటు చేశారు. అయితే కూరగాయల కోసం అటువంటి ప్రత్యేక కౌంటర్లేవీ ఏర్పాటు చేయలేదు. ప్రజలు నిత్యం వినియోగించే కూరగాయల దరలను అదుపుచేయకుండా ప్రభుత్వం దళారులకు అండగా ఉంటోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కూరగాయలు కొనాలంటేనే భయమేస్తోంది



ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పప్పులు, నూనెలు కొనలేకపోతున్నాం. ఇప్పుడు కూరగాయల ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. కూరగాయలు కొనాలంటే ఆలోచించాల్సి వస్తోంది. కార్తీక మాసంలో కూరగాయల ధరలు మండి పోతున్నాయి.

–రాములమ్మ

### ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



ఈ ప్రభుత్వం వచ్చాక కూరగాయల ధరలు రెట్టింపునకు పైగా పెరిగాయి. రూ.20 ఉండే టమాట రూ.40, రూ.30 ఉండే ఉల్లిపాయలు రూ.60కు పెరిగాయి. ఇలా ధరలు పెరి గిపోతే ఇంకా కూరలు ఎలా తింటాం. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – హైమావతి, నంద్యాల

### టార్గెట్ పూర్తి చేయండి

**నంద్యాలఅర్బన్:** విద్యుత్ బకాయిల వసూళ్లలో టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని నంద్యాల జిల్లా ఎస్ఈ సుధాకర్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరధిలోని ఏడీ, ఏఈ విద్యుత్ ఉద్యోగులతో సమావేశం నిర్వహిచారు. ఎస్ఈ మాట్లాడుతూ వ్యవసాయ రైతులకు సంబంధించి అరియర్స్‌ను త్వరగా వసూలు చేయాలని సూచించారు. వినియోదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్‌లోడ్ ఉన్న ట్రాన్స్‌పార్మర్లకు అదనపు వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

### వరి తర్వాత మినుము సాగు మేలు

**నంద్యాలఅర్బన్:** వరి పంట కోత తర్వాత మినుము, పెసర, అలసంద పంటలు సాగు చేస్తే భూమిలో చౌడు తగ్గి సారవంతమవుతుందని మండల ఏఓ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని చాబోలు, హైస్కూల్ కొట్టాల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీలో సాగైన జొన్న పంటను కత్తెరపురుగు, కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. వాటి నివారణకు ఎకరాకు 6–8 లింగాకార్షక బుట్టలతో పాటు అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏఈఓలు ముక్తార్‌బాషా, మహేశ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సస్యరక్షణతో అధిక దిగుబడులు


అల్లూరులో మిరప పంటను పరిశీలిస్తున్న ఏఓ

**ఉయ్యాలవాడ :** పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చేపడితే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని అల్లూరు, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మిరప, వరి, పప్పుశనగ పంటలను క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు. సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలుకువలు వివరించారు.

### వందశాతం అక్షరాస్యత సాధించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శివమల్లేరప్ప

**శిరివెళ్ల:** వంద శాతం అక్షరాస్యత సాధించాలని ఎంపీడీఓ శివమల్లేరప్ప అన్నారు. మంగళవారం స్థానిక ఏంపీడీఓ కార్యాలయంలో ఉల్లాష్ ప్రోగ్రాంలో భాగంగా వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సెర్ప్, వయోజన విద్యా ఆధ్వర్యంలో అక్ష్యరాస్యతా కార్యక్రమం మొదలవుతుందన్నారు. 15–50 ఏళ్ల మధ్య వయస్సులో ఉన్న నిరక్ష్యరాస్యులను గుర్తించి, చదువు చెప్పేందుకు 10 మందికి ఒక వలంటీర్‌ను నియమించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏంఈఓ శంకరప్రసాదు, వెలుగు ఏపీఎం రాజశేఖరరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణలత పాల్గొన్నారు.

### సుద్దమల్లలో వైద్యసేవలు


సుద్దమల్లలో చికిత్సలు చేస్తున్న వైద్యాధికారి

**ఉయ్యాలవాడ :** గ్రామాల్లో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వినోద్ తెలిపారు. మంగళవారం మండలంలోని సుద్దమల్ల గ్రామంలో ఉయ్యాలవాడ వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది 104 వాహనం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 74 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

**రుద్రవరం:** మండల పరిధిలోని ఆర్.కొత్తూరు–ఎర్రగుడిదిన్నె గ్రామాల మధ్య నాలుగు రోడ్ల కూడలి వద్ద ఇసుక ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేయగా ట్రాక్టర్ పట్టు బడిందని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

### రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


కరపత్రాలను విడుదల చేస్తున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

**నంద్యాల (వ్యవసాయం):** ఈనెల 14వ తేదీ నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నంద్యాల డీఈఓ జనార్దన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. నంద్యాల గ్రంథాలయ శాఖ అధికారి శ్రీధర్, మధు మాట్లాడుతూ 14న బాలా దినోత్సవ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమ నాయకుల స్మరణ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవ వేడుకలు, 20వ తేదీ వారోత్సవాల ముగింపు వేడుకలు ఉంటాయన్నారు. ముగింపు కార్యక్రమంలో పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందని అన్నారు.

### గీజర్ పేలి మహిళకు గాయాలు

**చాగలమర్రి:** మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మంగళవారం గీజర్ పేలడంతో నారాయణమ్మ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఇంట్లోని స్నానపు గదిలో స్నానం చేయటానికి వేడి నీళ్ల కోసం గ్యాస్ గీజర్‌ను ఆన్ చేయగా ప్రమాదవశాత్తు గీజర్ పేలి మంటలు వ్యాపించగా, వేడి నీళ్లు ఆమె శరీరంపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు పట్టణంలోని కార్పొరేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ఆమె బంధువులు తెలిపారు.

## ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


తహశీల్దార్ శ్రీనివాసులు

**ఉయ్యాలవాడ :** సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితా పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాను ఎన్నికలు జరగనున్న గ్రామ సచివాలయాల్లో నోటీస్ బోర్డులో అతికించనున్నట్లు తెలిపారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలు వుంటే 13వ తేదీ సాయంత్రం వరకు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 15న పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ, 20న పోటీలో వున్న అన్ని డబ్ల్యూఏ(టీసీ) కమిటీ సంఘాలకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

**ఓటరు జాబితా సిద్ధం**

**రుద్రవరం:** మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వాహణకు సంబంధించి ఓటరు జాబితా సిద్ధం చేసినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలో 16 చెరువులు, 13 తెలుగుగంగ కాల్వ సంఘాలు కలిపి మొత్తం 29 సంఘాలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఎన్నికలు నిర్వహించేందుకు ఓటరు జాబితా సిద్ధం చేశామన్నారు. బుధవారం నాటికి తుది ఓటరు జాబితా విడుదల కానుందని చెప్పారు. 16 చెరువుల కింద 2281 మంది, 13 టీజీపీ కాల్వల కింద 20,630 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఒక్కో చెరువుకు ఆరుగురు టీసీలు, ఒక్కో టీజీపీ కాల్వకు 12 మంది టీసీలను ఎన్నుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపించామని, అక్కడి నుంచి అనుమతులు రాగానే తదిపరి చర్యలు తీసుకుంటామన్నారు.

సాగు నీటి సంఘాల ఓటర్ల జాబితా వివరాలు ఇలా వున్నాయి.

| గ్రామం | నీటిసంఘం | డబ్ల్యూఏ సంఖ్య | ఓటర్లు |
|---|---|---|---|
| రూపనగుడి | చెరువు | 6 | 191 |
| తుడుమలదిన్నె | చెరువు | 6 | 67 |
| హరివరం | కేసీ కాలువ | 9 | 749 |
| సుద్దమల్ల | కేసీ కాలువ | 12 | 606 |
| ఇంజేడు | కేసీ కాలువ | 9 | 879 |
| పెద్దయమ్మనూరు | కేసీ కాలువ | 10 | 792 |
| కాకరవాడ-1 | ఎస్సార్బీసీ | 4 | 118 |
| కాకరవాడ -2 | ఎస్సార్బీసీ | 5 | 168 |
| తుడుమలదిన్నె | ఎస్సార్బీసీ | 12 | 157 |
| మాయలూరు | ఎస్సార్బీసీ | 12 | 501 |
| అల్లూరు | ఎస్సార్బీసీ | 12 | 327 |

## హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

- వివాదాస్పదంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ నియామకం
- ఏక పక్షంగా వ్యవహరిస్తున్న త్రిసభ్య కమిటీ


చిలకలూరు ప్రభుత్వ పాఠశాల


గతంలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న బీబీ (ఫైల్)

**రుద్రవరం:** మండల పరిధిలోని చిలకలూరు ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నియామకం వివాదాస్పదంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గతంలో ఉన్న ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీని నియమించారు. అయితే ఆ నియామకాన్ని రద్దు చేయాలని పాత ఏజెన్సీ వారు హైకోర్టును ఆశ్రయించారు. పూర్వాపరాలు పరిశీలించిన హైకోర్టు కొత్త నియామకాన్ని రద్దు చేసి, పాత ఏజెన్సీతోనే మధ్యాహ్న బోజనం సాగించాలని ఆదేశాలు జారీ చేసింది. వాటిని ఏజెన్సీ వారు తీసుకువచ్చి త్రిసభ్య కమిటీకి అందించగా.. అలా కుదరదు అధికారికంగా తమకు ఆదేశాలు అందాలని చెబుతూ ఏక పక్షంగా వ్యవహరిస్తూ.. కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేశారు.

**24 ఏళ్లుగా వంట నిర్వహణ**

గ్రామానికి చెందిన బీబీ అనే మహిళ గత 24 ఏళ్లుగా చిలకలూరు పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తూ ఎలాంటి వివాదాలు లేకుండా మంచి పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమెను తొలగించి సుజాత అనే మహిళకు ఏజెన్సీ బాధ్యతలు అప్పగించారు. తాను ఏ తప్పు చేయలేదని, భోజన విషయంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా నాణ్యతగా వడ్డించానని బీబీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు తిరిగి ఆమెను ఏజెన్సీ నిర్వాహకురాలిగా నియమించాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను బీబీ కుటుంబ సభ్యులు నబి రసూల్ తీసుకెళ్లి త్రిసభ్య కమిటీ సభ్యులు తహసీల్దారు మల్లికార్జున రావు, ఎంఈఓ కోటయ్యకు ఇవ్వగా మాకు అధికారికంగా అందినప్పుడు ఆలోచిస్తామని చెప్పి పంపినట్లు బాధితులు విలేకరులకు తెలిపారు.

**అధికారికంగా ఆదేశాలు వస్తే చర్యలు తీసుకుంటాం..**

ఏజెన్సీ నియామక విషయంపై తహసీల్దారును, ఎంఈఓను వివరణ కోరగా పాత ఏజెన్సీ నిర్వాహకురాలు పాఠశాల వద్ద ఉన్న కిచెన్ షెడ్డులో వంట చేయటంలేదని, అక్కడ బియ్యం లేవని, హాజరులో తేడాలు ఉండటంతో ఆ ఏజెన్సీని రద్దు చేశామని తెలిపారు. అలాగే హైకోర్టు ఆదేశాలపై అడగ్గా బాధితులు తీసుకువస్తే ఎలా?, అధికారికంగా తమకు అందినప్పుడు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ


బంగారు పుష్పాల అలంకరణలో శ్రీకాళికాంబాదేవి, శ్రీ వేంకటేశ్వరస్వామి

**నంద్యాల (వ్యవసాయం):** కార్తీక మాసం శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి, శ్రీ కాళికాంబా దేవికి వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. స్థానిక సంజీవ్ నగర్ రామాలయంలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు నిర్వహించి స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి 108 బంగారు పుష్పాలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ కాళికాంబా చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాత సేవ పంచామత అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలచే అమ్మవారికి అష్టాదళ పాదపద్మరాధన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## 15లోగా హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

**చాగలమర్రి:** ఈ నెల 15వ తేదీ కల్లా హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జ్ డీఎల్‌డీఓ శివారెడ్డి పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ వారి బ్యాంకు ఖాతాలు మరియు ఆధార్ నేషనల్ పేమేంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింకప్, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ ఈ నెల 15వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. నంద్యాల జిల్లా పరిధిలో పురోగతి తక్కువగా ఉన్న మండలాల్లో వేగం పెంచాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## మెక్కలు నాటి సంరక్షించాలి


మొక్క నాటి నీరు పోస్తున్న డీఈఓ

**గోస్పాడు:** ప్రతివిద్యార్థి ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి శాశ్వత జ్ఞాపికగా ప్రకృతికి అందించాలని జిల్లా అటవీశాఖాధికారి నాగమణీశ్వరి, డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోస్పాడు ఏపీ మోడల్ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మొక్కలు నాటే ప్రతిపాఠశాలకు అటవీశాఖ నుంచి మొక్కలు సరఫరా చేస్తామన్నారు. ప్రకృతిలో వాతావరణ కాలుష్య నివారణకు మెక్కలను నాటడం, పెంచడం ఒక్కటే మంచి పరిష్కారమార్గమన్నారు. పాఠశాల ఆవరణలో 150 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇదేమి చోద్యం

**ఆళ్లగడ్డ:** నియోజకవర్గంలో టీడీపీ నాయకులు అధికార జులుం ప్రదర్శిస్తున్నారు. తమకు కాని వ్యవహారాల్లో సైతం తలదూరుస్తూ విమర్శలు ఎదుర్కొంటున్నారు. శిరివెళ్ల మండలం కామినేనిపల్లెలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్యం పనులకు ఆ నాయకుడు ఆటంకం కలిగిస్తున్నాడని గ్రామ సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి మంగళవారం ఎంపీడీఓ శివమల్లేరప్ప, డీపీఓ నసీముద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు (గ్రీన్ అంబాసీడర్లు)ఉన్నారు. ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. అయితే టీడీపీ నాయకుడు రాంభూపాల్‌రెడ్డి గ్రామ పంచాయతీకి తెలియకుండా ఎవరి అనుమతి లేకుండా చెత్తసేకరించే రిక్షాలను స్వాధీనం చేసుకొని, తన ఇంటివద్ద ఉంచుకొని పారిశుద్ధ్య పనులకు ఆటకం కలిగించాడని తెలిపారు.

**విచారణ చేయిస్తా**

కామినేనిపల్లె గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య వ్యవహారంపై ఈఓఆర్డీతో విచారణ చేయిస్తానని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమస్యను పరిష్కరిస్తామన్నారు.

### వివాహిత అదృశ్యం

**రుద్రవరం:** మండల పరిధిలోని పెద్దకంబలూరుకు చెందిన స్వాతి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ వరప్రసాదు మంగళవారం తెలిపారు. తెల్లవారు జామున 4 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఎంతకూ రాలేదని, చుట్టు పక్కల, బంధువుల ఇళ్లు గాలించినా ఆచూకీ లభించలేదని భర్త పుల్లయ్య ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

**రైతుపై దాడి**

**రుద్రవరం:** మండల పరిధిలోని హరినగరం గ్రామానికి చెందిన లక్ష్మయ్య అనే రైతుపై అదే గ్రామానికి చెందిన నాగేంద్ర అనే మరో రైతు దాడి చేసినట్లు ఎస్ఐ వరప్రసాదు మంగళవారం తెలిపారు. పొలం వద్ద సాగు నీరు పారించుకునే విషయంలో వారిద్దరి మధ్య గతంలో వాగ్వాదం చోటుచేసుకుంది. అది మనసులో ఉంచుకొని 10వ తేదీ రాత్రి తన ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ తనపై దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

**మోటర్ సైకిల్ అపహరణ**

**రుద్రవరం:** మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలోని కిట్టయ్య అనే వ్యక్తికి చెందిన ఏపీ39ఎఫ్ఎం 9803 నంబరు గల మోటర్ సైకిల్ అపహరణకు గురైనట్లు ఏఎస్ఐ రాంభూపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీన రాత్రి మోటర్ సైకిల్‌ను ఇంటి ముందు ఉంచానని, తెల్లారగానే చూడగా కన్పించలేదని బాధితుడు ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

**రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి**


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**నంద్యాల:** పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్‌అహ్మద్ మంగళవారం తెలిపారు. 50 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి నంద్యాల రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫారం 2 వద్ద సాధారణ మరణం పొందాడన్నారు. మృతుని పేరు, ఊరు వంటి వివరాలు తెలియడం లేదన్నారు. మృతదేహన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరచామని, మృతుని ఆచూకి వివరాలు తెలిసినవారు సెల్ 94406 27653, 94900 81633 నంబర్లను సంప్రదించాలన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం

**నంద్యాల(న్యూటౌన్):** ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్రానికి చెందిన ఎపీఫనీ సంస్థ ఎడ్యుకేషనల్ మెరిట్ టెస్ట్ (ఈఎంటీ) నిర్వహించి నగదు ప్రో త్సాహకం అందించనుంది. విద్యార్థులు ఎలాంటి రుసుము లేకుండా పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో ఎక్కడినుంచైనా హాజరుకావచ్చు. ఈ పరీక్షకు సబంధించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామ రాజు గత నెల 15న షెడ్యూల్ విడుదల చేశారు.

**నగదు బహుమతులు**

రాష్ట్రవ్యాప్తంగా మెరిట్ ఆధారంగా 162 మందిని ఎంపిక చేసిన రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులు అందించనున్నారు. రాష్ట్రస్థాయిలో పదో తరగతిలో ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు అందిస్తారు. 7వ తరగతిలో రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున అందజేస్తారు. జిల్లాస్థాయిలో 10వ తరగతిలో రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, 7వ తరగతి విద్యార్థులకు రూ.5 వేలు, రూ.4 వేలు రూ.3 వేలు నగదు బహుమతులు అందిస్తారు. ఇక మండలస్థాయిలో 7, 10 తరగతుల్లో ప్రథమ స్థానం పొందిన వారికి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రశంసాపత్రాన్ని అందిస్తారు. విద్యార్థులు మొబైల్ ఫోన్/ల్యాప్‌టాప్/ట్యాబ్/కంప్యూటర్ ద్వారా నిబంధనల ప్రకారం పరీక్ష రాయాలి. డిసెంబరు 22 నుంచి ప్రిలిమ్స్, జనవరి 10 నుంచి మాక్ టెస్టులు సైతం సాధన చేయొచ్చు. httpr://educationaepiphany.orfeemt2024/retirtration.php వెబ్‌లింక్ ద్వారా నవంబరు 14లోపు దరఖాస్తు చేసుకోవాలి.

### బహువార్షిక పంటలతో అధిక లాభం

**గోస్పాడు** బహువార్షిక పంటల వల్ల రైతుకు సరైన ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కో ఆర్డినేటర్, సీనియర్ ప్రకృతి వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. గోస్పాడు మండలంలోని జిల్లెల్లలో బాలమద్దిలేటి, శ్రీనివాసపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు సుజాత పొలాన్ని మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ దేశవాళీ వరి వంగడాలు సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రతి రైతు అవలంబించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య, డీపీఎం నరేందర్ రెడ్డి, అడిషనల్ డీపీఎం సాలాం బాషా, రామాంజిరెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.